నేటి దినపత్రిక
సూర్య
కర్నూలు | నంద్యాల
శుక్రవారం | 15 డిసెంబర్ 2023 | పేజీలు 8

# వైసీపీ ప్రభుత్వం అభివృద్ధికి ఆమడ దూరం

- నంద్యాల జిల్లా బీజేపీ అసెంబ్లీ కార్యాలయం ప్రారంభం
- బీజేపీ అసెంబ్లీ అభ్యర్థిగా అభిరుచి మధు
- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరి


బీజేపీ అసెంబ్లీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పూజలు చేస్తున్న బైరెడ్డి శబరి, అభిరుచి మధు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్ళలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని, అన్ని వర్గాల వారిని, మహిళలను ఇబ్బందులకు గురిచేస్తూ జైళ్ళకు పంపుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి ధ్వజమెత్తారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ మిగతా 2లో



# అభ్యర్థి బలమే కీలకం..!

- ఆ తరువాతే రాజకీయ పార్టీల బలం
- సానుభూతి, చరిష్మాలకు కాలం చెల్లినట్లే

**కర్నూలు, సూర్య ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల వేడి రాజుకుంటోంది. మరో రెండు నెలల్లో ఎన్నికల షెడ్యూలు విడుదల కానుండటంతో అందుకు తగ్గట్లుగా అన్ని రాజకీయ పార్టీలు వ్యూహ, ప్రతి వ్యూహాలతో సిద్ధపడుతున్నాయి. ఆయా పార్టీల అధినేతలు అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారిస్తున్నారు. మరో నెల రోజుల లోపే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రధాన పార్టీలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఇదే సమయంలో అన్ని రాజకీయ పార్టీలు రానున్న ఎన్నికల అంశంపై అనేక అభిప్రాయాలను సేకరిస్తున్నాయి. ఆయా పార్టీలకు సంబంధించిన రాజకీయ సలహాదారులు, సర్వే సంస్థలు ఒక వైపు పని చేస్తున్నప్పటికీ పార్టీల అధినేతలు తమ కార్యకర్తల మనోభావాలను సైతం తెలుసుకునే ప్రయత్నం జరుగుతోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసీపి పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చాలన్న నిర్ణయానికి వచ్చినట్లు వైసిపీ నేతలకే కాకుండా రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 65 శాసన సభ, 6 లోక్‌సభ స్థానాల్లో పార్టీ అభ్యర్థులు మారుతారన్న సమాచారం పార్టీ నేతలు పరోక్షంగా సంకేతాలు ఇస్తున్నారు. ఇప్పటికే 11 శాసన సభా నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జీలను సైతం మార్చారు. ఇందుకు ప్రధాన కారణం రానున్న ఎన్నికల్లో అభ్యర్థుల బలం కీలకం కానుందన్న విశ్వాసమేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు. గత 2019 ఎన్నికల్లో కేవలం జగన్మోహన్ రెడ్డి చరిష్మా, వివేకానంద రెడ్డి హత్య, కోడి కత్తి దాడి వంటి అంశాలు ప్రధానంగా వైసిపి విజయానికి దోహదపడ్డాయని స్పష్టం చేస్తున్నారు. నాటి ఎన్నికల్లో స్థానిక అభ్యర్థుల బలం అత్యల్పమని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అతి కొద్ది నియోజకవర్గాల్లో మాత్రమే స్థానికంగా అభ్యర్థుల బలం పార్టీకి తోడైందని వారు గుర్తు చేస్తున్నారు. అయితే గత నాలుగున్నర సంవత్సరాలుగా మారిన పరిస్థితుల నేపథ్యంలో పార్టీ బలానికి తోడు అభ్యర్థుల బలం లేకపోతే పోటీలో నిలబడలేమన్న మిగతా 2లో

## గ్యాస్ సబ్సిడీకి
# కెవైసీ తప్పనిసరి..!

- నెలాఖరులోగా వేలిముద్ర వేయాలి
- రాయితీ దుర్వినియోగానికి చెక్
- అధికారిక ఆదేశాలు వస్తే అమలు


ఈ-కేవైసీతో కూడిన సిలిండర్

**కర్నూలు, సూర్య ప్రతినిధి:** దేశ వ్యాప్తంగా వంట గ్యాస్ వినియోగదారులు త్వరలో కెవైసీ నమోదు చేయించుకోవాల్సిందేనని కేంద్రం కొత్త నిబంధనలు తీసుకువస్తోంది. సబ్సిడీ గ్యాస్‌పై ప్రస్తుతం ఇస్తున్న రాయితీ దుర్వినియోగం కాకుండా తగిన చర్యలు తీసుకునే ప్రయత్నంలో భాగంగా కెవైసీ నిబంధనను తీసుకువస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని పౌర సరఫరాల శాఖకు, ఆయా గ్యాస్ డీలర్లకు ఇప్పటికే సమాచారం అందింది. అయితే ఇందుకు సంబంధించిన మిగతా 2లో

## ప్రజా బలంతో
# వైసీపీ గెలుపు ఖాయం

- రాష్ట్రమంతటా విద్యాకాంతులు విరబూయిస్తున్న ఘనత సీఎం జగన్‌దే
- విద్యార్థి లోకం జగన్‌కు రుణపడి ఉంటుంది
- నగరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ
- పాల్గొన్న నగర మేయర్ బి.వై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్


భారీ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజా బలంతో వైసీపీ గెలుపు ఖాయమని, ఎవర్ని జిమ్మిక్కులు చేసినా ఆంధ్రలో మళ్లీ గిరాగిరా తిరిగేది మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు చైతన్య, నగర మేయర్ బి.వై.రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌లు పేర్కొన్నారు. గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్ ఆధ్వర్యంలో గురువారం నగరంలో భారీ ర్యాలీనిర్వహించారు. నగరంలోని రాజ్‌విహార్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వందలాదిమంది విద్యార్థులతో మిగతా 2లో

## హృదయ్ పథకం కింద
## కర్నూలు, రాజమండ్రి
# నగరాలను చేర్చండి
మిగతా 8లో

## 75 కుటుంబాలు
## తెలుగుదేశం పార్టీలో
# చేరిక
మిగతా 5లో

## అక్రమంగా తరలిస్తున్న
## స్కూల్ బియ్యం
# పట్టివేత
మిగతా 3లో

# తీవ్ర కరువుతో బ్రతుకు భారం
## - కనికరించండి సారూ



**బేతంచెర్ల, మేజర్‌న్యూస్ :** అప్పులు చేసి పెట్టుబడి పెట్టి వేసిన పంటలకు సరియైన సమయంలో వర్షాలు పడకపోవడంతో రైతులు తీవ్ర కరువుతో బతుకు భారంగా మారిందని రైతులు ఆత్మహత్యలు తప్పవని కావున కనీస పరిహారంతో కనికరించాలని గురువారం కేంద్రబృందం సభ్యులతో రైతులు ఆవేదన వ్యక్తం చేయగా సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు ,మండల కార్యదర్శి యన్న భార్గవ్ లు మోకాళ్ళ మీద కూర్చొని ఎకరాకు రూ.30 వేలు నష్ట పరిహారం చెల్లించాలని వినతిపత్రం అందచేశారు. మండలంలోని ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలో గల మిగతా 2లో

# వైసీపీ ప్రభుత్వం అభివృద్ధికి ఆమడ దూరం

(మొదటిపేజీ తరువాయి)

అభిరుచి మధు ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కార్యాలయాన్ని బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో నంద్యాల జిల్లా ఇన్‌చార్జి రమేశ్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలో బైరెడ్డి శబరి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి శూన్యమన్నారు. రైతులు, యువత, మహిళలు, ఎస్సీ, బీసీ, ఎస్టీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని యువతకు మాయమాటలు చెప్పి ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి జగన్ నాలుగున్నరేళ్ళల్లో 10వేల మందికి ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. యువత ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీఎం వల్ల పరిశ్రమలు రాక ఇతర రాష్ట్రాలకు వెళ్లడం వల్ల ఉపాధి లేక వలసలు పోతున్నారన్నారు. జిల్లాలో ఆరు మండలాలు కరువు ప్రాంతాలుగా గుర్తించారని, మండలాల్లో ఉన్న ప్రజలు కుటుంబ పోషణకు పక్క రాష్ట్రాలకు వలసపోతున్నారన్నారు. ప్రభుత్వానికి అవగాహన లేదన్నారు. చదువు లేకపోయినా డబ్బు ఉన్న వారికి ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రులు, సలహాదారులు వైసీపీ పార్టీలో ఉన్నారని పేర్కొన్నారు. వరదలకు పంటలు నష్టపోతే వరద ప్రాంతాల్లో ముఖ్యమంత్రి వైయస్ జగన్ దూరం నుంచే చేయి ఊపుతూ ఆసుపత్రిలో బాధితులతో పరామర్శించడం సిగ్గుచేటన్నారు. ఉల్లిగడ్డకు, ఆలుగడ్డకు తేడా తెలియని ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. జిల్లాలో బీజేపీలో యువరక్తం ఉరకలేస్తుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా బూత్ కమిటీలు, మోర్చా కమిటీలు చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరీకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర బీజేపీ పార్టీ ఆదేశాల మేరకు నంద్యాల నియోజకవర్గం కార్యాలయం ఏర్పాటు చేశామని అన్నారు. నంద్యాల అసెంబ్లీ కన్వీనర్‌గా పార్టీ నియమించింది అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ నంద్యాల అసెంబ్లీ అభ్యర్థిగా పోటీలో ఉన్నానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటాలు, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రజల్లోకి తీసుకుని వెళతానన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కశెట్టి కృష్ణమూర్తి, చంద్రశేఖర్, మేడా మురళీధర్, డాక్టర్ ఇంటి ఆదినారయణ, తూము శివారెడ్డి, నిమ్మకాయల సుధాకర్, బ్రహ్మం, ముక్తియార్ బాషా, రాధాకృష్ణ, లక్ష్మీకాంతరెడ్డి, ఉపేంద్రనాథరెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి శ్రీలక్ష్మి, స్వాతి, చెన్నమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ కరసేవకులకు ఘన సన్మానం:** శ్రీరామచంద్రమూర్తి జన్మభూమి అయిన అయోధ్య ఏర్పాటులో పాల్గొన్న కరసేవకులను రామేశ్వరప్రసాద్, నాగరాజారావు, రాధాకృష్ణ, సత్యనారాయణ, మోహన్, యోగి, కృష్ణమూర్తి, మిద్దె వెంకటేశ్వర్లను బీజేపీ జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి, మేడా మురళీధర్ తదితరులు ఘనంగా సన్మానించారు. ఆనాటి స్మృతులను పంచుకుంటూ హిందువుల పుణ్యభూమి శ్రీరామచంద్రమూర్తి జన్మభూమి ఆలయాన్ని ముస్లింలు ఆక్రమించి నిర్మించుకున్నారని తెలియడంతో బీజేపీ కార్యకర్తలు, ఆర్‌ఎస్ఎస్ శ్రేణులు కలిసి అప్పట్లో హిందువుల హక్కులను రక్షించుకోవడానికి స్వాధీనం చేసుకున్నామని అందులో తాము కూడా పాల్గొనడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని కరసేవకులు తెలిపారు.

# తీవ్ర కరువుతో బ్రతుకు భారం

(మొదటిపేజీ తరువాయి)

రైతు భరోసా కేంద్రం సమీపంలో గల హుస్సేన్ భాష,వడ్ల మూడవ కాశిం వేసిన కంది పంటలను కేంద్రబృందం సభ్యులు నీతిఆయోగ్ సీనియర్ రీసెర్చ్ అధికారి అనురాధ భట్నా, జలాశక్తి మంత్రిత్వశాఖ త్రాగునీరు,పారిశుద్ధ్యం విభాగం సహాయ సలహాదారు ఆర్.సంతోష్, డిపార్ట్మెంట్ ఆఫ్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ అండర్ సెక్రటరీ సంగీత్ కుమార్ లు పరిశీలించారు.బేతంచెర్ల ,మిడుతురు,పగిడ్యాల మండలాలు కరువు మండలలుగా ప్రభుత్వం ప్రకటించడంతో కేంద్ర బృందం రైతులతో కరువు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా మండలాల కరువు ప్రభావ పరిస్థితుల పోటోలను పరిశీలించారు.

**రైతులతో ముఖాముఖీ :** ఆర్ ఎస్ .రంగాపురం గ్రామంలో గల రైతు భరోసా కేంద్రంలో డి ఆర్ ఓ పుల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి టి.మోహన్ రావు ఆధ్వర్యంలో రైతులతో ముఖాముఖీ నిర్వహించారు. గ్రామానికి చెందిన కృష్ణా రెడ్డి ప్రత్తి పంట వేసి తీవ్రంగా నష్ట పోయానని,మధు శేఖర్ 10 ఎకరాలలో కంది పంట వేయగా అప్పుల పాలయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. పగిడ్యాల మండలానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి మొక్కజొన్న పంట వేసి తీవ్రంగా నష్టపోయానని ఆవేదనను వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ బుగ్గన నాగభూషణ్ రెడ్డి, ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ సర్పంచ్ గుమ్మగాళ్ల రాజులు మాట్లాడారు.

# గ్యాస్ సబ్సిడీకి కెవైసీ తప్పనిసరి..!

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి నిబంధనలు తెలియపర్చలేదని గ్యాస్ డీలర్లు వెల్లడిస్తున్నారు. తమకు అందిన సమాచారం ప్రకారం ఈ నెల 31వ తేదీ లోగా వంట గ్యాస్ సబ్సిడీని అందుకుంటున్న వినియోగదారులు తప్పనిసరిగా కెవైసీ చేయించుకోవాల్సి ఉందని వారంటున్నారు. అయితే ఇప్పటి వరకు పూర్తి స్థాయి మార్గ దర్శక సూత్రాలు, విధి విధానాలు రాని కారణంగా గడువు తేదీని మార్చే అవకాశం ఎక్కువగా ఉందని వారంటున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తమకు అందిన సమాచారం మేరకు గ్యాస్ సబ్సిడీని పొందుతున్న వినియోగదారులకు ఇప్పటి వరకు ఎలాంటి ఆర్థిక, ఆదాయ పరిమితి లేదని వారు గుర్తు చేశారు. సంవత్సరాదాయం ఎక్కువగా ఉన్న వారు సబ్సిడీ వదులుకునేందుకు చాలా కాలం నుంచి అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని అనేక మంది వినియోగించుకొని సబ్సిడీ అవకాశాన్ని వదులుకున్నారు. అయితే ఇంకా భారీ సంఖ్యలో అధిక ఆదాయం ఉన్న వారు సబ్సిడీని పొందుతున్నారని కేంద్రం గుర్తించింది. అంతేగాక మరణించిన వారి పేరుపై ఉన్న గ్యాస్ కనెక్షన్‌ను డీలర్లకు అందజేయకుండా, ఇతరులకు బదిలీ చేసుకోకుండా వినియోగించుకుంటున్న వారు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా అనేక రకాలుగా గ్యాస్ సబ్సిడీ దుర్వినియోగం అవుతోందని కేంద్రం కొత్తగా కెవైసీ నిబంధనను అమలు చేయడానికి ముందుకు వచ్చినట్లు వారు స్పష్టం చేస్తున్నారు. కొత్త నిబంధనల ప్రకారం ఆధార్‌కు లింకు అయిన గ్యాస్ కనెక్షన్ మాత్రమే ఇక ముందు కొనసాగుతుందని లేదంటే ఆ కనెక్షన్ రద్దు అవుతుందని వారంటున్నారు. తాజాగా ఆధార్ కు లింక్ అయిన గ్యాస్ కనెక్షన్ విని యోగదారులు ఆధార్ నంబరు వినియోగించి బయోమెట్రిక్ నమోదు చేయాల్సి ఉంటుందని వెల్లడిస్తున్నారు. ఇక ఆదాయ పరిమితి కూడా ఏడాదికి రూ. 8లక్షలకు మించి ఉండరాదని నిబంధన విధిస్తు న్నట్లు తెలుస్తోంది. ఆదాయ వనరులకు సంబంధించి వినియోగ దారుల బ్యాంకు ఖాతాల లావాదేవీల ద్వారా తెలుసుకుంటారని భావిస్తున్నా ఆ అంశంపై స్పష్టత రాలేదని పేర్కొంటున్నారు. కాగా కెవైసీ ఎక్కడ చేయించుకోవాలి అనే ప్రశ్నకు సమాధానంగా ఆయా గ్యాస్ కంపెనీలు తమ మొబైల్ యాప్‌లను అప్‌డేట్ చేస్తున్నాయని వాటిలో కూడా కెవైసీ నమోదు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారని వారంటున్నారు. అంతేగా గ్యాస్ డీలర్లు తమ వద్ద పని చేస్తున్న గ్యాస్ సరఫరాదారులకు మొబైల్ ఇచ్చి వారి ద్వారా కూడా కెవైసీ చేయించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడవుతోంది. ఇక మీ సేవ, ఆధార్ సెంటర్లు, సిఎస్‌సి కేంద్రాల ద్వారా కూడా కెవైసీ నమోదు చేసుకోవచ్చని వెల్లడవుతోంది. అయితే పూర్తి స్థాయి నిబంధనలు అధికారికంగా రావాల్సి ఉందని పేర్కొంటున్నారు. కాగా కేంద్రం ఇస్తున్న అరకొర రాయితీకి కూడా కెవైసీ, ఆదాయ పరిమితి అంటూ నిబంధనలు పెట్టడంపై వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. మొత్తం మీద కేంద్రం నుంచి పూర్తి స్థాయి నిబంధనలు అధికారికంగా అమలు ఆదేశాలు వస్తే వినియోగదారుల ప్రతిస్పందన ఎలా ఉంటుందో వేచి చూడాలి.

# ప్రజా బలంతో వైసీపీ గెలుపు ఖాయం

(మొదటిపేజీ తరువాయి)


విద్యార్థులతో కలిసి డ్యాన్సులు వేస్తున్న మేయర్, ఎమ్మెల్యే

అత్యంత కోలాహలంగా భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థి సాధికారత జగనన్నతోనే సాధ్యం అనే నినాదంతో ఉత్సాహభరింగా ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా నగర మేయర్ బి.వై.రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, రాష్ట్ర నాయకులు పానుగంటి చైతన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న దురుద్ధేశ్యంతో తెలుగుదేశం పార్టీ అడ్డదారులు తొక్కుతుందని విమర్శించారు. టీడీపీ పరిస్థితి దయనీయంగా మారిందని, ఆ పార్టీ ఎన్ని కుతంత్రాలు చేసినా వచ్చే ఎన్నికల్లో పరాజయం తప్పదని, వైసీపీ ఘనవిజయం తథ్యమని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు చేర్పిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలతో విద్యాకాంతులు విరబూయిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కర్నూలు జిల్లాకు కొత్తగా లా యూనివర్సిటీ, మెడికల్ కళాశాల, క్లస్టర్ యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ తెచ్చిపెట్టిన ఘనత సీఎందేనని, విద్యార్థి లోకం ఆయనకు రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య నిర్మూలనకు సీఎం పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్ మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వైసీపీ భారీ మెజార్టీతో గెలుస్తుందని, రాష్ట్రంలో మళ్లీ ఫ్యాన్ తిరుగుతుందని, ఈ విషయం జాతీయ మీడియా అయిన టైమ్స్ నౌ సర్వే ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని పరుగులు తీయిస్తున్న జగన్ ప్రభుత్వానికి ప్రజలు మరోసారి పట్టం కట్టనున్నారన్నారు. ఈ ర్యాలీకి రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.

**ఉత్సాహంతో డ్యాన్సులు వేసిన ప్రజాప్రతినిధులు:**

వైసీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మేయర్ బి.వై.రామయ్యలు సందడి చేశారు. ర్యాలీలో ఆద్యంతం ఉత్సాహంగా పాల్గొని విద్యార్థులతో కలిసి జగనన్న పాటలకు స్టెప్పులు వేస్తూ ఉత్సాహ పరిచారు. దీంతో ర్యాలీ ఆద్యంతం సందడిగా సాగింది. సుమారు 1,500మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రాజునాయుడు, ఓబులేసు, మణిరెడ్డి, మధు, రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ కన్వీనర్ శ్రీరాములు, రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అభ్యర్థి బలమే కీలకం..!

(మొదటిపేజీ తరువాయి)

విషయం పార్టీ రాజకీయ సలహాదారులు, వ్యూహ కర్తలు, సర్వే సంస్థల అధ్యయనంలో వెల్లడించి ఉంటాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరో వైపు తమ నియోజకవర్గ ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జిలపై కార్యకర్తలు అనేక నియోజకవర్గాల్లో తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్న విషయం పార్టీ సైతం పలు సమీక్షల అనంతరం తెలుసుకొని ఆ విధంగా పథక రచన చేస్తోందని వైసిపి నేతలు భావిస్తున్నారు. ప్రస్తుతం కోస్తాంధ్రాలోని 11 నియోజకవర్గ ఇన్‌చార్జిలను మార్చిన వైసిపి అధి నాయకత్వం రానున్న రోజుల్లో ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో కూడా ఇన్‌చార్జిల మార్పుపై నిర్ణయం తీసుకుం టుందని వైసిపి నేతలు ఆశాభావంతో ఉన్నారు. గతంలో వారసులకు అవకాశం ఇవ్వబోనని తెలిపిన పార్టీ అధినేత తన అభిప్రాయాన్ని మార్చుకొని వారసుల పోటీకి అంగీకరించిన విషయం అందరికీ తెలిసిందేనని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. దీని వల్ల పార్టీ విజయావకాశాలు మెరుగుపడతాయని ధీమాతో ఉన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 151 స్థానాల్లో విజయం సాధించిన వైసిపి తాజాగా 65 మంది శాసన సభ సభ్యుల స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకోవడానికి ప్రధాన కారణం పార్టీ అధినేత చరిష్మా, సానుభూతి, సంక్షేమ పథకాల లబ్ది పార్టీకి ఈ సారి ఉండబోవని గ్రహించడమేనని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. అభ్యర్థుల మార్పు 65 కంటే ఎక్కువ స్థానాల్లో ఉండవచ్చని కూడా పార్టీలో ఊహాగానాలు వినిపిస్తున్నాయని వారు వెల్లడిస్తున్నారు. టిడిపిలో టిక్కెట్ల కేటాయింపు కొలిక్కి వచ్చిన తరువాత మరి కొన్ని మార్పులు, చేర్పులు ఉంటాయని వారు స్పష్టం చేస్తున్నారు.

ఇక ప్రతిపక్ష టిడిపిలో సైతం చంద్రబాబుపై సానుభూతి ప్రజల్లో కనిపిస్తున్నా అది ఎన్నికల్లో ప్రభావం చూపేంత కాదని పార్టీ గ్రహించినట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే జగన్ ముఖ్యమంత్రిగా పని చేసిన తీరు అంతకు ముందు చంద్రబాబు నాయుడు పని తీరును ప్రజలు బేరీజు వేసుకున్నారని వారు వెల్లడిస్తున్నారు. ఈ అంశం రానున్న ఎన్నికల్లో పని చేస్తుందని వారంటున్నారు. ఇందుకు స్థానిక అభ్యర్థుల బలం తోడైతే విజయానికి ఢోకా లేదని టిడిపి విశ్వసిస్తోందని పేర్కొంటున్నారు. తాము మేనిఫెస్టోలో ప్రకటించే సంక్షేమ పథకాలు కూడా పార్టీ విజయానికి ఒక మెట్టుగా వారు భావిస్తున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మరో వైపు అభ్యర్థుల ఎంపికపై పార్టీ అధినేత చంద్రబాబు పార్టీ నేతల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇస్తారని కూడా వారంటున్నారు. ఈ విషయాన్ని పార్టీ నాయకులు అంగీకరిస్తూ రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ అధినేత చంద్రబాబు వ్యూహ రచన చేస్తున్నారని వెల్లడిస్తున్నారు. పార్టీ గతంలో ఒక ఇంట్లో ఒకరికే టికెట్ అని నిర్ణయం తీసుకున్నా ఈ సారికి ఆ నిర్ణయంలో మార్పు ఉండవచ్చని వారు ధీమాతో ఉన్నారు. ఉత్తరాంధ్రాలో అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడులతో పాటు వారింటి ఆడపడచు ఆదిరెడ్డి భవాని గత ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన విషయాన్ని పార్టీ నాయకులు గుర్తు చేస్తున్నారు. గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ ఈ సారి ఎన్నికలకు దూరంగా ఉంటూ తన తల్లిని చంద్రగిరి నుంచి బరిలోకి దింపాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే జయదేవ్ పోటీ చేయాల్సిందేనని పార్టీలో ఒత్తిడి ఉందని పార్టీ నాయకుల ద్వారా తెలుస్తోంది. ఇక పార్టీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్, కర్నూలు జిల్లాలో కోట్ల, భూమా కుటుంబాలు కూడా ఇద్దరు చొప్పున బరిలో ఉన్న విషయం తెలిసిందేనని వారంటున్నారు. రానున్న ఎన్నికల్లో వీరిలో ఎవరిని నొప్పించినా పార్టీ విజయంపై ప్రభావం చూపుతుందన్న విషయం పార్టీలో చర్చకు వచ్చిందని వెల్లడవుతోంది. దీని కారణంగా ఒక కుటుంబానికి ఒకరే అన్న విషయంలో పార్టీ నిర్ణయం మారడం తథ్యమని పార్టీ నాయకులు కార్యకర్తలు ధీమాతో ఉన్నారు.

రెండు పార్టీల నిర్ణయాలు, వ్యూహాలను పరిశీలిస్తే రానున్న ఎన్నికల్లో పార్టీ నేతల చరిష్మా, సానుభూతి, సంక్షేమ పథకాల లబ్ది వంటి అంశాల కంటే స్థానిక అభ్యర్థుల ఎంపికనే విజయానికి తొలి మెట్టు అవుతుందన్న అభిప్రాయం కీలకమవుతోందని విష్లేషకులు వెల్లడిస్తున్నారు. అభ్యర్థి బలమైన వ్యక్తి కాకపోతే విజయావకాశాలపై దాని ప్రభావం ఖచ్చితంగా ఉంటుందని రాజకీయ పార్టీల నాయకులు సైతం అంగీకరిస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఆచి తూచి అడుగు వేస్తూ విజయమే లక్ష్యంగా పని చేస్తారని ప్రజలు సైతం అభిప్రాయపడుతున్నారు. రానున్న 2024 ఎన్నికలు టిడిపి, వైసిపిలకు చావో రేవో అన్న తరహాలో ఉంటాయని అన్ని వర్గాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# దాడి చేసినందుకే హత్య.. సీఐ



నిందితులను అరెస్టు చూపిస్తున్న దృశ్యం

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** కోడుమూరు పట్టణానికి చెందిన బోయ రవి హత్యకేసులో నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు కోడుమూరు సీఐ మనసురుద్దీన్ తెలిపారు. మృతుడు బోయ రవి కోడుమూరు పట్టణంలోని సుందరయ్యకాలనీ చెందిన బోయ శివక్రిష్ణ అనే యువకుడిని ఈ నెల 10వతేదీ రాత్రి తీవ్రంగా కొట్టినందువల్లే హత్య చేసినట్లు నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. ముందుగా పాతబస్టాండులోని కోట్ల సర్కిల్‌సమీపంలో ఘర్షణ జరిగిందని, ఈ ఘర్షణలో బోయ రవితోపాటు మరికొంతమంది బోయ శివక్రిష్ణను కొట్టడంతో అక్కడి నుంచి ఇంటికి వెళ్లి చినిగిన బట్టలను మార్చుకొని కత్తి తీసుకవచ్చి ఏఐటీయూసీ కార్యాలయం పక్కకు రవిని పిలిపించుకొని కత్తితో గజ్జల కింద పొడిచి తీవ్రంగా గాయపరచినట్లు సీఐ తెలిపారు. మృతుడు బోయ రవి, శివక్రిష్ణ అనే యువకులు గౌండ పని విషయంలో గతంలో ఘర్షణలు పడేవారని, దానిని మనసులో పెట్టుకొని వీరి ఇరువురి మధ్య తరచూ గొడవలు జరిగేవని సీఐ తెలిపారు. శివక్రిష్ణతోపాటు అశోక్, రాము, మరో మైనర్ ఈ హత్యలో పాల్గొన్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. నిందితులను పట్టుకోవడంతో కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు, గూడూరు ఎస్ఐ పీరయ్య, హెడ్‌కానిస్టేబుల్ వీరన్న, రాముడు, మహమ్మద్‌బాష చాకచక్యంగా వ్యవహరించినట్లు సీఐ తెలిపారు. వీరిని డీఎస్పీ విజయశేఖర్ అభినందించినట్లు త్వరలోనే వీరికి ఎస్పీ చేతుల మీదుగా రివార్డు కూడా అందజేయనున్నట్లు తెలిపారు.




## నిద్ర మాత్రలు మింగి వ్యక్తి ఆత్మహత్య



**కర్నూల్ క్రైమ్ మేజర్ న్యూస్ :** నగరంలోని కడకపురాకు చెందిన ఖాజా బాషా( 34) అనే వ్యక్తి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. వివరాల్లోకి వెళితే కుటుంబ సమస్యల కారణంగా ఈనెల 9వ తారీఖున ఖాజాభాష దాదాపు 30 నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తూ ఉండగా బుధవారం ఉదయం కోలుకోలేక మృతి చెందాడు. ఖాజా భాష డ్రైవర్ గా పని చేస్తు జీవనం కొనసాగించేవాడు. ఇతనికి ముగ్గురు పిల్లలు భార్య ఉన్నారు. భార్య నాజియా ఇచ్చి న ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న స్కూల్ బియ్యం పట్టివేత

ఆటోను సిజ్ చేసిన అధికారులు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** విద్యార్థులకు అందించాల్సిన మధ్యాహ్న భోజన బియ్యాన్ని రాత్రివేళ వంట ఏజెన్సీ నిర్వాహకులు పక్కదారి పట్టిస్తుండగా విద్యార్థి సంఘాల నాయకులు పట్టుకున్న సంఘటన ఎమ్మిగనూరు పట్టణంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎమ్మిగనూరులో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుంచి వంట ఏజెన్సీ నిర్వాహకులు, రికార్డ్ అసిస్టెంట్‌లు కలిసి రాత్రి 8.30 గంటల సమయంలో మధ్యాహ్న భోజన బియ్యం సుమారు ఆరు క్వింటల బియ్యం,విద్యార్థులకు ఇచ్చే చిక్కిలను ఓ ఆటోలో పాఠశాల గేట్ నుండి తరలిస్తుండగా విద్యార్థి సంఘాల నాయకులు గమనించి పట్టుకున్నారు. వెంటనే తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని పట్టు పడ్డ బియ్యం, ఆటో ను సిజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.దీనిపై పాఠశాల హెచ్ఎం కు వివరణ కోరగా పాఠశాల నుండి బియ్యం తరలిస్తున్న విషయం తనకు సంబంధంలేదన్నారు.అయితే విద్యార్థి సంఘాలనాయకులు మాత్రం హెచ్ఎం కు తెలియకుండా పాఠశాల నుండి బియ్యం ఎలా వెళతాయని ఇందులో హెచ్ఎం కుడా సంబంధం ఉందని తక్షణమే జిల్లా విద్య అధికారులు చర్యలు చేపట్టి ఇలా విద్యార్థులకు సంబందించిన బియ్యని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు రాజేష్ తదితరులు డిమాండ్ చేశారు.



పట్టుబడిన బియ్యం ఆటో దృశ్యం

## ఎస్సీసెల్ తాత్కాలిక ఛైర్మెన్‌గా ఎండ్లూరి లాజరస్

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ తాత్కలిక ఛైర్మన్‌గా ఎండ్లూరి లాజరస్ నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బాబురావు నియమించారు. ఈ మేరకు గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లాజరస్‌కు ధృవీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లాజరస్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చారని, పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, డీసీసీ కార్యదర్శి రియాజుద్దీన్, నాయకులు కొత్తపేట మున్నా, నవీద్ పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

## పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలి

బీజేపీ ఇంచార్జి మురహరి రెడ్డి డిమాండ్



**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించకపోతే ఉద్యమం తప్పదని నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి కె. ఆర్. మురహరి రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి గీతా మాధురిలు డిమాండ్ చేశారు. భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆదేశాలపెంచిన విద్యుత్ చార్జీలకు నిరసిస్తూ ర్యాలీగా వెళ్లి సబ్ స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా విద్యుత్ చార్జీలు పెంచి సామాన్య ప్రజానీకంపై పెనుభారం వేశారని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు తగ్గించకపోతేఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అనంతరం విద్యుత్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బి ఎల్ నారాయణ, మండలాల అధ్యక్షులు కిరణ్ కుమార్ బనవాసి రాముడు , జిల్లా కార్యవర్గ సభ్యులు కైరవాడి మల్లీ జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు లోకేష్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి రామ్ చరణ్, రఘువీర్, కాసిం, ఈరన్న, కద్ర, సోమశేఖర్ ,బజారి, బెస్త వెంకటేష్ రమేష్ కుమార్, శేఖర్, సీనా తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



మోకాళ్ళపై నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:** అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె గురువారం నాటికి మూడవ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా వెల్దుర్తి తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల వద్ద అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు, ఏఐటియుసి ఆధ్వర్యంలో మోకాళ్ళపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు చేపట్టిన సమ్మె మూడవ రోజుకు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన రాకపోవడం సిగ్గుచేటన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని శాంతియుతంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి మా ఇబ్బందులు కానరాకపోవడం దారుణమన్నారు. సమ్మె ఇలాగే కొనసాగితే అంగన్‌వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడటం ఖాయమని, తక్షణమే పాదయాత్ర సమయంలో అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల కార్యదర్శి ఈరమ్మ, వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల నాయకురాలు చాందినీ, వరలక్ష్మి, జయలక్ష్మి, మహేశ్వరి, షబానా, సుజాత, అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాడుదాం

– అంగన్‌వాడీ దీక్షలకు టీడీపీ, జనసేన మద్దతు

**పత్తికొండ టౌన్, మేజర్ న్యూస్ :** అంగన్‌వాడి కార్మికుల సమస్యలను పరిష్కరించేంతవరకు దీక్షలను కొనసాగిస్తామని సీఐటీయు మండల అధ్యక్ష, కార్యదర్శులు కాశీ విశ్వనాథ్, గోపాల్‌లు పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ, చర్చల పేరుతో కాలయాపన తప్ప సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. అంగన్‌వాడి సమస్యలను పరిష్కరించేంతవరకు పోరాడుతామన్నారు. మూడవ రోజు అంగన్‌వాడీ దీక్షలకు టీడీపీ, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సోమ్లా నాయక్, జనసేన ఇంచార్జ్ రాజశేఖర్‌లు మాట్లాడుతూ, వైఎస్సార్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటూ,అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో పతనం తప్పదన్నారు. మద్దికెర మండల కార్యదర్శి రాముడు, వెంకటేశ్వర్లరెడ్డి, అంగన్‌వాడి కార్మిక నాయకురాలు శోభ, కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.



దీక్షలలో మాట్లాడుతున్న టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షులు

## అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు అండగా నిలుస్తాం

డోన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మారం మన్నె సుబ్బారెడ్డి

**డోన్, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ హయాంలోనే నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా సమయంలో అంగన్‌వాడి వర్కర్లకు, హెల్పర్లకు జీతాలు పెంచారని, వారి కష్టాలను తెలుసుకున్న చంద్రబాబునాయుడు వారి అండగా నిలవడం జరిగిందని, అదే తరహాలోనే ప్రస్తుతం ప్రతిపక్ష హోదాలో ఉన్న తెలుగుదేశం పార్టీ అంగన్‌వాడివర్కర్లు, హెల్పర్లు చేపడుతున్న న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కొరకు అండగా నిలుస్తామని డోన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మారం మన్నె సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదురుగా అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న సమ్మెకు ధర్మారం మన్నె సుబ్బారెడ్డి, రాష్ట్ర టిడిపి కార్యదర్శి వలసల రామకృష్ణలు తెలుగుదేశం పార్టీ తరపున వారి సమ్మెకు మద్దతు తెలిపారు.



## జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్:** జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు –2023 అధికారుల ఆదేశాల మేరకు కొలిమిగుండ్ల విద్యుత్‌శాఖ వారి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఈరోజు మోడల్ స్కూల్ కొలిమిగుండ్ల నందు విద్యార్థులకు విద్యుత్ పొదుపు గురించి అవగాహన కార్యక్రమం జరపడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది హెడ్మాస్టర్ మరియు ప్రిన్సిపల్ మరియు ఎలక్ట్రికల్ ఎ.ఈ ప్రసన్నాంజనేయులు పాల్గొనడం జరిగింది.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

సూర్య

శుక్రవారం 15 | డిసెంబర్ 2023

# టీడీపీతోనే ప్రతి కుటుంబానికీ లబ్ధి



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరుతుందని, చంద్రబాబు నాయుడుని సీఎం చేసుకోవాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలుగు యువత తాలూకా అధ్యక్షుడుకృష్ణతేజ నాయుడు పేర్కొన్నారు. గురువారం అయన 27వ వార్డులో బాబు షూరిటీ–భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వార్డు ప్రజలకు బాండ్ పేపర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ఇంటికి తిరిగి గతంలో టీడీపీ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాల గురించి, రాబోయే రోజుల్లో చేపట్టబోయే పథకాల గురించి ప్రజలకు వివరించారు.రానున్న ఎన్నికల్లో ప్రజలు జగన్ రెడ్డిని ఓడించి ఇంటికి పంపడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర అభివృద్ధితో పాటు సంపద సృష్టించి మహాశక్తి, యువగళం, బీసీ రక్షణ చట్టం, ప్రతి ఇంటికి మంచి నీరు, అన్నదాత, పూర్ టూ రిచ్ వంటి పథకాలను అమలు చేస్తామని తెలియచేసారు. ఎమ్మిగనూరులో ఎమ్మెల్యేగా బీవీ. జయనాగేశ్వర రెడ్డి విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంజిత్, వడ్డే వీరేష్, హాసన్, అర్జున్ కంసలి తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న జగత్ విఖ్యాత్ రెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** 2024లో జరిగే ఎన్నికల్లో తెదేపా జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకుని రావాలని తాలూకా టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యత్‌రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. గురువారం ఆళ్లగడ్డ పట్టణంలోని కొత్త మసీదు,బృందావనం కాలనీలలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన ప్రజలతో మాట్లాడారు. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికి మంచి భవిష్యత్తు ఉండేలా తెదేపా జనసేన ఉమ్మడి మేనిఫెస్టోతో తయారు చేయడం జరిగిందన్నారు. యువతకు ఉపాధి రైతుకు భరోసా అన్ని వర్గాలకు సంక్షేమం తెదేపాతోనే సాధ్యమన్నారు. నవరత్నాల పథకాలు అందరికీ అందలేదని కొందరికే అందాయని ఆయన ఆరోపించారు. తెదేపా జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా ప్రజల మద్దతు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, మాజీ జెడ్పిటిసి చాంద్ బాష, తెదేపా నాయకులు నన్నేభై గారి జిలన్, చిన్న కందుకూరు మాధవరెడ్డి, నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా..ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ



ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్ః** పట్టణంలోని స్థానిక జర్నలిస్టు కాలనీలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తానని పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ అన్నారు. గురువారం ఆమె తనయుడు కంగాటి రామ్మోహన్‌రెడ్డి అయ్యప్పమాల ఇరుముడి దీక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరంఆలయంలోనిస్వాములందరికీ ప్రత్యేక పూజలు చేశారు. దర్శనార్థం వచ్చిన భక్తులకు అల్పాహారంఅందించారు. అలాగేఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకంగాటి శ్రీదేవమ్మను సత్కరించారు.

# బాజి చౌదరి జన్మదిన వేడుకలు



కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ పరిశీలకులు వాసుదేవ ఫౌండేషన్ ట్రస్ట్ మేనేజర్ కనుమూరి బాజి చౌదరి జన్మదిన వేడుకలను బనగానపల్లె పట్టణంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్థన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా కేక్ కట్ చేసి మాజీ ఎమ్మెల్యే బాజి చౌదరికి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని అభివృద్ధి పథంలో నడిపించడానికి బాజి చౌదరి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని అలాంటి వ్యక్తి ఆయురాగ్యాలతో సుఖషాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.

## గ్రామీణ తపాల ఉద్యోగుల నిరసన

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** తమ డిమాండ్ల సాధనలో భాగంగా ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఆళ్లగడ్డ శాఖ ఈనెల 12 నుండి నిరవధిక సమ్మెలో పాల్గొనడం జరిగింది. ఇందులో భాగంగా గురువారం ఆళ్లగడ్డ పాత బస్టాండ్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ శాఖ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు జయరాముడు లు మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులకు 8 గంటల పని మరియు పెన్షన్తో సహా అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ ఐదు లక్షల పెంచాలని, గ్రాడ్యూటీ 5 లక్షల పెంచాలని, టార్గెట్లు మేలాల రూపంలో గ్రామీణ తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్ని రకాల వేధింపులను ఆపివేయాలని తదితర డిమాండ్లతో నిరసన చేయడం జరిగిందన్నారు. తమ డిమాండ్లను ఆమోదించేంతవరకు నిరవధిక సమ్మె చేయడం జరుగుతుందన్నారు.

# మార్షల్ ఆర్ట్స్ సాధన ఏకాగ్రతను పెంచుతుంది

**– రాజ్యసభ్య మాజీ సభ్యులు టీజీ వెంకటేష్**



క్రీడాకారులను అభినందిస్తున్న టీజీ వెంకటేష్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** మార్షల్ ఆర్ట్స్ సాధన ఏకాగ్రతను పెంచుతుందని రాజ్యసభ్య మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. నగరంలోని తన నివాసంలో గురువారం జిల్లాస్థాయి ఉషూ పోటీల విజేతలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ చిన్నారులు చదువుతోపాటు అన్ని క్రీడలు రాణించాలన్నారు. అనంతరం జిల్లా స్థాయి పోటీల్లో పథకాలు సాధించిన విద్యార్థులకు టీజీ వెంకటేష్ పతకాలు, కప్పులను అందజేశారు. జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఈరోజు 20మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు.

# ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు జగనే సిఎం కావాలి

**వైకాపా మండల కన్వీనర్ బొమ్మన రవీంద్రనాథ్‌రెడ్డి**



వైకాపా జెండాను ఆవిష్కరించిన బొమ్మన రవీంద్రనాథ్‌రెడ్డి, నాయకులు

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు, గ్రామాలలో అభివృద్ధి పనులు చేసేందుకు మరోసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి కావాలని మండల వైకాపా కన్వీనర్ బొమ్మన రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సచివాలయం–3 నందు వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని జడ్పిటిసి సుంకన్న, సర్పంచ్ శైలజ, బ్రహ్మగుండం ఆలయ చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి, పత్తికొండ మార్కెట్‌యార్డు డైరెక్టర్ గట్టు ఆరీఫ్, గ్రామ వైకాపా నాయకులతో కలిసి సచివాలయం నందు సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. అలాగే 15వ వార్డు, ఐజి నగర్‌లో నీళ్ళ ట్యాంక్ దగ్గర వైకాపా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బొమ్మన రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలౌతున్నాయని, భవిష్యత్తులోనూ ఇదే తరహాలో సంక్షేమ అభివృద్ధిజరగాలంటేవైయస్.జగన్‌మోహన్‌రెడ్డిమరోసారి ముఖ్యమంత్రి కావాల్సిందేనన్నారు. జగనన్న సుపరిపాలన చరిత్రలో ప్రత్యేక అధ్యాయమన్నారు. చరిత్రలో కూడా ఎన్నడూ లేని విధంగా సంక్షేమ అభివృద్ధి ప్రగతి పట్టాలపై దూసుకెళ్తుందన్నారు. గతంలో టిడిపి పాలనకు ఇప్పటి వైకాపా పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలందరూ గమనించాలని, మేలు జరిగిందని భావిస్తే మళ్ళి జగనన్నను ఆశీర్వదించాలని, అలాగే మరోసారి 2024 ఎన్నికలలో కంగాటి శ్రీదేవమ్మను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. చంద్రబాబునాయుడు తెలుగు రాష్ట్రాలకు ముఖ్యమంత్రిగా ఉన్న ఏమి అభివృద్ధి చేయలేదన్నారు. దివంగత నేత వైయస్ఆర్ పాలనే మరల కొనసాగిస్తామని చెప్పు ధైర్యం ఒక్క సిఎం జగన్‌కే ఉందన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని ఎస్.బోయినపల్లె గ్రామంలో వైకాపా నాయకుడు నర్సింగ్ అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే రామళ్ళకోట గ్రామంలో కూడా సంక్షేత పథకాల గురించి ఇంటింటికి తిరుగుతూ గృహసారధులు, గ్రామ వాలంటీర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గెలిచేది టిడిపినే..అధైర్యం వద్దు ..ధర్మారం మన్నె సుబ్బారెడ్డి

**వైకాపాను వీడి టిడిపిలోకి 50 కుటుంబాలు చేరిక**



ధర్మారం సుబ్బారెడ్డి సమక్షంలో టిడిపిలో చేరిన గ్రామ వైకాపా నాయకులు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలవడం ఖాయమని, ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నామని, ఏ ఒక్క టిడిపి నాయకుడు, కార్యకర్త, పార్టీని నమ్ముకున్న ఏ ఒక్కరూ కూడా అధైర్యపడకూడదని డోన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మారం మన్నె సుబ్బారెడ్డి భరోసానిచ్చారు. గురువారం మండల పరిధిలోని బావిపల్లె గ్రామంలో బాబుష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన చిన్నసుంకన్నకు చెందిన కుటుంబాలు, నాగిశెట్టి అనుచరులు దాదాపు 50 కుటుంబాలు ధర్మారం మన్నె సుబ్బారెడ్డి సమక్షంలో టిడిపి కండువాను కప్పుకున్నాయి. ఈ సందర్భంగా ధర్మారం మన్నె సుబ్బారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మహిళలందరికీ రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం, ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఏడాదికి తల్లికివందనం పథకం కింద రూ.15వేలు, నిరుద్యోగులకు రూ.3వేలు నిరుద్యోగభృతి వంటి పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. కావున ఎవ్వరు కూడాఢీలా పడాల్సిన పని లేదని, వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని ధైర్యానిచ్చారు. టిడిపిలో చేరిన వారిలో నడిపెన్నగారి రాము, ఆరవ శ్రీనివాసులు, మహేష్, నడిపెన్నగారి భరత్, నల్లబోతుల గోపి, ఎన్.ప్రసాద్, నేరేడుచెర్ల మల్లికార్జున, మండ్ల వెంకటేష్, తదితర కుటుంబాలు చేరాయి. ఈ కార్యక్రమంలో ఆర్ఈ.రాఘవేంద్ర, టిడిపి మండల అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, మెట్టుపల్లె సుదర్శన్, లక్ష్మినారాయణయాదవ్, న్యాయవాది అరుణ్, నల్లమేకలపల్లె సత్యం, నరసింహులు, ఏనుగుమర్రి రాము, పోతుదొడ్డి పుల్లారెడ్డి, జలదుర్గం విష్ణు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల సేవలు యథాతథంగా జరగాలి



అధికారులతో సమీక్ష చేస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్

**నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్ :** అంగన్‌వాడీల నిరవధిక సమ్మె సందర్భంగా చంటి పిల్లలు, గర్భిణీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన చాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తల ప్రత్యామ్నాయ సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల, ఆయాలు నిరవధిక సమ్మెలో పాల్గొని ధర్నా చేస్తున్న సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్లు మూతపడకుండా చంటిపిల్లలు, గర్భిణీలకు కార్యకర్తల సేవలందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లాలోని ఎంపీడీఓలు, ఐసీడీఎస్, సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏపీఎంలు, డిప్యూటీ సీఈఓ, డీఆర్‌డీఏ పీడి, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయ సిబ్బందికి సంబంధిత అంగన్‌వాడీ సెంటర్లను అనుసంధానం చేసి సెంటర్ల మనుగడకు ఎలాంటి అంతరాయం లేకుండా అంగన్‌వాడీ సేవలు యథాతథంగా జరిగేలా చూడాలని తెలిపారు. జిల్లాలో మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లు 1620, మినీ అంగన్‌వాడీ సెంటర్లు 43 మొత్తం 1663 అంగన్‌వాడీ సెంటర్లు పనిచేస్తున్నాయని ఈసెంటర్ల ద్వారా చంటి పిల్లలకు పంపిణీ చేసే పౌష్టికాహారం, పాలు, గుడ్డు, బాలామృతం, గర్భవతులకు, బాలింతలకు పంపిణీ చేసే బియ్యం, కందిబేడలు, నూనె, వైయస్సార్ కిట్లు, పాలు తదితర వాటిని లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

**ఇంటర్ కాలేజియేట్ అథ్లెటిక్**

## ఛాంపియన్‌షిప్ ప్రారంభం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** రాయలసీమ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌ను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పీఎఫ్.రెహ్మాన్ గురువారం ప్రారంభించారు. రెక్టార్ ప్రొఫెసర్ సివి.కృష్ణారెడ్డి, రిజిస్ట్రర్ ప్రొఫెసర్ సుందరానందపుచ్చ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవన విధానంలో భాగంగా శారీరక శ్రమను అలవర్చుకోవాలని సూచించారు. రాయలసీమ యూనివర్సిటీకి చెందిన దాదాపు 20అనుబంధ కళాశాలలు ఈ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ శివకిషోర్ పాల్గొన్నారు.



# నంద్యాల జిల్లా ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలిగా గుండా సుప్రజ



గుండా సుప్రజను సత్కరిస్తున్న టి.జి వెంకటేష్

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** నంద్యాల జిల్లా ఆర్యవైశ్య మహిళా మండలి ప్రథమ నూతన మహిళా అధ్యక్షురాలిగా బనగానపల్లె పట్టణానికి చెందిన శ్రీమతి గుండా సుప్రజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బీజేపి రాష్ట్ర నాయకులు మాజీ రాజ్యసభ సభ్యుడు టి.జి వెంకటేష్ నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా మండలి నూతన అద్యక్షురాలిగా గుండా సుప్రజను గురువారంనాడు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఆర్యవైశ్య సంఘం మహిళా మండలి సభ్యురాలిగా ఎన్నికైన గుండా సుప్రజ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ తొలి మహిళా గవర్నర్‌గా మోటివేషనల్ ట్రైనర్‌గా, సమరసత ఫౌండేషన్ జిల్లా కన్వీనర్‌గా ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం బనగానపల్లె ఆర్యవైశ్య మహిళా సంఘం గౌరవ సలహాదారుగా ఉన్నారు. తనపై నమ్మకం ఉంచి ఎంతో బాధ్యతతో నంద్యాల జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలిగా పెద్దలు ఎంపిక చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు సుప్రజ తెలిపారు. జనవరిలో టి.జి వెంకటేష్ నేతృత్వంలో ప్రమాణస్వీకార కార్యక్రమం జరగనున్నట్లు వెల్లడించారు.

# గాడి తప్పిన వైసీపీ పాలన



గ్యారెంటీ కరపత్రాలను అందజేస్తున్న ఎంఎస్. అన్సర్ భాష

**చాగలమరి ,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో వైసిపి పాలన గాడి తప్పిందనిటిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ భాష ఆరోపించారు. గురువారం స్థానిక గుంత పాలెం కాలనీలోని 229వ బూతులో మాజీ మంత్రివర్యులు భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకుబాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల పెరుగుదల, డీజిల్, పెట్రోల్, విద్యుత్ చార్జీల పెంపు చివరికి చెత్తపై కూడా పన్నులు విధిస్తూ ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మదార్ సాహెబ్, జింక చిన్న మదరవల్లి, పెద్ద మొహమ్మద్, క్లస్టర్ ఇంచార్జ్ ముల్లా అజీమ్, ప్రచార కార్యదర్శి ముల్లా గఫార్, ప్రధాన కార్యదర్శి ముల్లా ఆలంశ గారి హనీఫ్, రియాజ్, వీరమ్మ గారి కాజా రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలను అవమానించడం తగదు..

డోన్ టిడిపి ఇంఛార్జ్ ధర్మారం మన్నె సుబ్బారెడ్డి

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్‌:** తమ హక్కుల సాధనకై పోరాటం చేస్తున్న అంగన్‌వాడిలను హేళనగా మాట్లాడటం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి తగదని డోన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మారం మన్నె సుబ్బారెడ్డి అన్నారు. గురువారం స్థానిక తహశిల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్స్ చేస్తున్న నిరవధిక సమ్మెకు డోన్ టిడిపి ఇంచార్జ్ ధర్మారం మన్నె సుబ్బారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్ళిన అంగన్‌వాడిలపై మంత్రి బుగ్గన హేళనగా మాట్లాడడాన్ని ఆయన తప్పుబట్టారు. అంగన్‌వాడిలంటే బుగ్గనకు ఎందుకంత చులకనభావమని ప్రశ్నించారు. మంత్రి బుగ్గన తన అహంకార ధోరణిని మార్చుకోవాలని హితవు పలికారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన మాట ప్రకారం అంగన్‌వాడిల సమస్యలను వెంటనే పరిష్కరించే వరకు వారి పోరాటానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, పట్టణ టిడిపి అధ్యక్షులు సిఎం శ్రీనివాసులు, నంద్యాల జిల్లా బీసిసెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జున, ప్యాపిలి మండల టిడిపి అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, తెలుగుయువత మండల అధ్యక్షుడు చనుగొండ్ల కాశి, సిఐటియు నాయకులు శివరాం, రామాంజినేయులు, అంగన్‌వాడి వర్కర్స్, నాయకురాలు శోభా, రహమత్‌బీ తదితరులు పాల్గొన్నారు.



సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతున్న ధర్మారం మన్నె సుబ్బారెడ్డి

# తపాలా ఉద్యోగుల సమస్యలను తీర్చాలి

కొనసాగుతున్న పోస్టల్ ఉద్యోగుల సమ్మె

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** కొన్నేళ్లుగా నెలకొన్న తపాలా ఉద్యోగుల సమస్యలను వెంటనే తీర్చాలని ఆల్ ఇండియా తపాలా ఉద్యోగుల సంఘం బ్రాంచ్‌అధ్యక్షులు వై. కృష్ణా, చాంద్ భాషాలు డిమాండ్ చేశారు. గురువారం 3వ రోజు ఎమ్మిగనూరులో స్థానిక పోస్ట్ ఆఫీస్ ముందు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ గ్రామీణ తపాల ఉద్యోగులకు 8 గంటలు పని కల్పించి, పెన్షన్ సహా అన్ని ప్రయోజనాలను కల్పించాలని డిమాండ్ చేశారు. సీనియర్ జీడిఎస్‌లకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గ్రాటుటీ, గ్రూప్ ఇన్సూరెన్స్ 5 లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను పరిష్కరించేంత వరకు మా నిరవదిక సమ్మె కొనసాగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో వేణుగోపాల్,పోస్టుమాస్టర్‌గోపాల్, ఎం. ఓలు దివాకర్, జావిద్ బాషా, ఉద్యోగులు బాలకృష్ణ గణేష్, తులసమ్మ, పద్మా తదితరులు పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు

# అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలి

సమ్మెకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ



అంగన్వాడీలకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** అంగన్ వాడీల సమస్యలను పరిష్కరించడంలో సీఎం జగన్ నిర్లక్షం చేస్తున్నారని, తక్షణమే వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్టియు నాయకులు గోవిందు రాముడు తిమ్మగురుడు, వీరేష్, ప్రసాద్ ,రాజు,అంగన్ వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్స్ నాయకులు గోవర్ధనమ్మ,కృష్ణ వేణి, నీరజ బసమ్మ, వెంకట లక్ష్మీలు కూడా డిమాండ్ చేశారు. గురువారం ఏపీ అంగన్ వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్( జేఏసీ) అధ్వర్యంలో 3 వ రోజు సమ్మె ను కొనసాగించారు.అలాగే సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో ముఖాలపై కూర్చుని దీక్షలు చేపట్టారు. దీక్షలకు మాజీ ఎమ్మెల్యే బీవీ సంఘీభావం తెలిపారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వం దిగి వచ్చే దాకా సమ్మె చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలోనాగలక్ష్మి,పుష్పవతినాగశిరోమని,పద్మ, శైలజ, నాగేశ్వరమ్మ,సుబ్బమ్మ, గ్రేసమ్మ, మేరీ, నీరజ,మల్లీశ్వరి, పుష్ప ,జయమ్మ, శంసాద్ బేగం ,సుజాత, రాగమ్మ,ప్రభావతి, సునంద, వేంకటేశ్వరమ్మ, తులసీ,ప్రమీలమ్మ పాల్గొన్నారు.

# ఎల్లార్తి దర్గాలో భక్తిశ్రద్ధలతో ఫాతేహాలు

★ పర్యవేక్షించిన ఈఒ అబ్దుల్ రెహమాన్



శేక్షావలి తాతను దర్శించుకుంటున్న భక్తులు

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామంలో కొలువుదీరిన హజరత్ శేక్షావలి,హజరత్ షాషావలి తాతల దర్గాలో గురవారం భక్తులు భక్తిశ్రద్దలతో ఫాతేహల్‌ను నిర్వహించారు. మండలం నుండి కాకుండా ఆంధ్రా దూర ప్రాంతాల నుండి,కర్ణాటక ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. భక్తులు నైవేధ్యాలు చేసుకుని మేళాతాళాతో తాతల దర్గాకు వచ్చి ప్రత్యేకంగా పూజలు చేసి ధైవదెర్శనం చేసుకున్నారు.రెండు దర్గాలో భక్తుల సందడి నెలకొంది.తాతల దర్గాలను ఈఒ అబ్దుల్ రెహమాన్ పర్యవేక్షించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా తగు చర్యలు చేపట్టారు.

# మోకాళ్లపై నిలబడి నిరసన- మూడో రోజుకు చేరిన దీక్షలు

మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక కేరళ ఆస్పత్రి ఎదురుగా అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. గురువారం సిఐటియు నాయకురాలు పద్మావతి, వసంత,నాగమణిల ఆధ్వర్యంలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు మోకాళ్లపై నిలబడి, గడ్డి తింటూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ దీక్షలకు తెలుగుదేశం పార్టీ, వివిధ ప్రజా సంఘాల నాయకులు తమ మద్దతును సంఘీభావాన్ని తెలిపాయి.ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సిఐటియు నాయకురాల్లు మాట్లాడుతూఅంగన్వాడి కార్యకర్తలు ఆయాల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం వారి స్థానంలో ప్రత్యామ్నాయ పద్ధతులను ఏర్పాటు చేయడం సిగ్గుచేటు అన్నారు.తమ న్యాయమైన కోరికల పరిష్కారం కోసం గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడి కార్యకర్తలు సహాయకులు పాల్గొన్నారు.



# 75 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరిక

**శిరివెళ్ళ, మేజర్‌న్యూస్ :** శిరివెళ్ళ మండల పరిధిలోని గుండంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సర్పంచ్ మౌనిక ఆధ్వర్యంలో సుమారు 75 కుటుంబాలు, నలుగురు వార్డు మెంబర్లు భూమా అఖిల ప్రియ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, భార్గవరామ్ నాయుడు సమక్షంలో వైఎస్సార్‌సీపిని వీడి 75 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా వైసీపీ సర్పంచ్ మౌనిక మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విధి విధానాలు నచ్చక ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. అనంతరం అఖిల ప్రియ మాట్లాడుతూ 2024లో తెలుగుదేశం పార్టీ అఖండ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని, పల్లెలు, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. వైసీపీ రాబోయే రెండు నెలల్లో ఖాళీ కావడం ఖాయమని ఈ సందర్భంగా ఆమె అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన దృశ్యం

# బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి




**కొలిమిగుండ్లమేజర్,న్యూస్‌:** కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లె గ్రామం ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్ ఆధ్వర్యంలో విద్యార్థి విద్యార్థినులు బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి బడికి పోదాం కార్యక్రమాన్ని బందార్లపల్లె గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రాఘవేంద్ర ప్రాసద్ పంచాయితీ కార్యదర్శి పుల్లయ్య వెల్ఫేర్ అసిస్టెంట్ మధు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అంగన్‌వాడీల సంక్షేమం



మాట్లాడుతున్న కిరణ్మయి

**కోడుమూరు, మేజర్‌న్యూస్:** టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అంగన్‌వాడి సంక్షేమం జ రిగిందని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్‌ఆర్గనైజర్ నేశపోగు కిరణ్మయి అన్నారు. గురువారం అంగన్‌వాడి దీక్ష శిబిరానికి చేరుకొని కిరణ్మయి వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడి వర్కర్ అండ్ హెల్పర్స్ సమస్యలు న్యాయబద్ధమైనవని, వారి సమస్యలు పరిష్కరించాల్సిందేనన్నారు. అంగన్‌వాడి వర్కర్ల పోరాటానికి తన మద్ధతు ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడి వర్కర్లు సమ్మె చేస్తున్నా ఈ ప్రభుత్వానికి వారి సమస్యలు పట్టడం లేదని విమర్శించారు. అంగన్‌వాడిలకు ఇచ్చిన హామీని సీఎం వైఎస్‌జగన్ విస్మరించారిన దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో గౌరి, తులసి, సీపీఎం నాయకులు గఫూర్, సీఐటీయూ నాయకులు మోహన్, ఈరన్న, అంగన్‌వాడి హెల్పర్స్‌అండ్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సూలమ్మ పాల్గొన్నారు.

## మున్సిపల్ షాపుల బహిరంగ వేలం ప్రారంభం



వేలం పాటలు నిర్వహిస్తున్న దృశ్యం

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** నగరంలోని వెంకటరమణ కాలనీలోని నగర పాలక సంస్థ నిర్మించిన కేఎంసీ ఫ్రైడ్‌ప్లాజా షాపింగ్ కాంప్లెక్స్ బహిరంగ వేలం గురువారం ప్రారంభమైంది. ఈ బహిరంగ వేలం కార్యక్రమంలో కమిషనర్ భార్గవతేజ, అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, రెవెన్యూ ఆఫీసర్ జునైద్‌లు పాల్గొన్నారు. 15, 16వతేదీల్లో కూడా నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. రోజుకు 18షాపుల చొప్పున మూడురోజులపాటు బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు రూ.9లక్షలు డిపాజిట్ కట్టి బహిరంగ వేలంలో పాల్గొనాలన్నారు. గురువారం 9షాపులకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## 29వవార్డులో వై ఏపీ నీడ్స్ జగన్



మాట్లాడుతున్న కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి

**కల్లూరు, మేజర్‌న్యూస్:** కల్లూరు అర్బన్ పరిధిలోని 29వవార్డులో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. 29వవార్డు కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు మద్ధతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్‌ఇన్‌చార్జి భీమేశ్వరరెడ్డి, నాయకులు క్రిష్ణారెడ్డి, హుసేన్‌ఆలం, 71వవార్డు సచివాలయ కన్వీనర్లు పీడీ బాష, భాగ్యమ్మ పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీయాలి



నమూనాలను పరిశీలిస్తున్న డీఈవో

**కల్లూరు, మేజర్‌న్యూస్:** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి వి.రంగారెడ్డి అన్నారు. గురువారం కల్లూరు మండలంలో మండల స్థాయి వైజ్ఞానిక సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి, కల్లూరు ఎంఈవో-1 శ్రీనివాసులు, ఎంఈవో-2 వనజకుమారి, కల్లూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హుసేన్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే లక్ష్యాలను చేర్చుకోవచ్చు

### - సెట్కూరు మేనేజర్ సత్యనారాయణ



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కల్లూరు, మేజర్‌న్యూస్:** ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తే లక్ష్యాలను చేర్చు కోవచ్చని సెట్కూరు మేనేజర్ సత్యనారాయణ అన్నారు. సెట్కూరు-యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో గురువారం చిన్నటేకూరులోని అంబేద్కర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్‌కౌన్సిలింగ్, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగ సాధనకు చదువుతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో అవసరమన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు రాజశేఖర్ మాట్లాడుతూ యువత స్మార్ట్‌ఫోన్‌పై ఎక్కువగా ఉపయోగిస్తూ చదువుపై ధ్యాస ఉంచడం లేదని, మొబైల్‌కు దూరంగా ఉండాలన్నారు. యువత నైతిక విలువలు పాటిస్తూ, పట్టుదలతో కృషి చేసి విజయశిఖరాలను చేరుకోవాలన్నారు.

## వైసీపీ ప్రభుత్వంలో ఉనికి కోల్పోతున్న దళితులు

### - టీడీపీ ఇన్‌ఛార్జీ ఎన్ఎండి ఫరూక్





టీడీపీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్ :** టీడీపీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో దళితుల పంతం...వైసీపీ అంతం అనే నినాదంతో నంద్యాల జిల్లా కార్యాలయంలో దళిత శంఖారావం సభ నిర్వహించడం జరిగింది. ఈసభకు ముఖ్య అతిథిగా ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్‌రాజు పాల్గొన్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నంద్యాల ఇన్‌చార్జి ఫరూక్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దళితులు తమ ఉనికిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా దళితులకు సంక్షేమ పథకాలు అందించారని ఎస్సీ, ఎస్టీలు, దళిత బిడ్డలకు మేనమామంటూ ఓట్లు దండుకున్న జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక దళితులను అని విధాలుగా అణగదొక్కుతున్నారని ముఖ్యమంత్రి తీరుపై పార్టీలోని దళిత నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు స్పందించడం లేదని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులపై జరుగుతున్న దాడులు, అరాచకాలు, అకృత్యాలు, అత్యాచారాలను అడ్డుకట్ట వేయాలంటే వచ్చే ఎన్నికల సంగ్రామంలో దళితులందరూ ఐక్యమత్యంగా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరుచరిత, రాష్ట్ర ఎస్సీ విభాగం అధికార ప్రతినిధులు గంధం శ్రీనివాసులు, కైలాస్, బుడగ జంగాల నాయకుడు కొండ బుగ్గరాముడు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రీసర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

### - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ నారపురెడ్డి మౌర్య

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** రాష్ట్రంలో మూడో దశ రీ సర్వేకు సంబంధించి గ్రౌండ్‌ట్రూత్, గ్రౌండ్ వాల్యువేషన్ త్వరిగా పూర్తి చేయాలని, ఫైనల్ ఆర్‌ఓఆర్ సిద్ధం చేయాలని, స్టోన్‌ప్లాంటేషన్లు కూడా వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా పనుల నిమిత్తం ఇవ్వాల్సిన భూములు అవార్డు పాస్ అయిన వెంటనే వారికి అప్ప జెప్పాలన్నారు. ప్రభుత్వ గోదాముల నిర్మాణంలో రాష్ట్రంలో కర్నూలు, పల్నాడు, నంద్యాల, అనంతపురం జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయని అభినందించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించడంలో దేశంలో ఆంధ్రప్రదేశ్ 5వ స్థానంలో ఉందని, ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలను అవసరమైన ప్రజల కు అందించే చర్యలు చేపట్టాలన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయ భవనాలు వెంటనే సంబంధించిన శాఖలకు అప్పజెప్పే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్‌వో మధుసూధన్‌రావు, జడ్పీ సీఈవో నారసరెడ్డి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈలు, జిల్లా వ్యవయాసాధికారి, ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** మంత్రాలయం మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 2022-23 సంవత్సరానికి చేపట్టిన పనులపై గురువారం ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ మణిమంజిరి ఆధ్వర్యంలో మహాత్మగాంధీ సామాజీక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీడి అమర్‌నాథ్‌రెడ్డి, ఆడిషనల్ పిడి మాధవిలత, డిఈఓ భాస్కర్, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ, 17వ సామాజీక తనిఖీ గ్రామాల్లో డిసెంబర్ 2నుండి డిసెంబర్ 12వరకు నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద 911 పనులు, పిఆర్ కింద 48 పనులు చేశారు. మొత్తం వాటి విలువ రూ.8 కోట్ల 80లక్షల ఖర్చు అయిందని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో తనిఖీలు నిర్వహించగా, రూ. 24వేల 422లు అవినీతి జరిగినట్లు డిఆర్‌పిలో గుర్తించారు. అందుకుగాను 14వేల 406లు రికవరీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం కరువు మండలంగా మంత్రాలయం మండలంగా ప్రకటించింది. వంద రోజులు గ్రామాల్లో పనులు కల్పించాలి, వలసలు వెళ్లకుండా నివారించాలన్నారు. ప్రజలకు అవసరమయ్యే పనులు గుర్తించి చేపట్టాలని ఆయన ఉపాధి హామీ పథకం సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అంబుడ్సనర్ చంద్రశేఖర్, జెపిడి లోకేశ్వరి, పంచాయితీ రాజ్ ఎఈ నరసింహులు, ఏపిఓ తిమ్మారెడ్డి, ఈసి శ్రీనివాసులు, టిఏలు రఘువీర నాయుడు, రేణుక, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి



**కల్లూరు, మేజర్‌న్యూస్ :** ఫ్లోరోసిస్ వ్యాధి పై ప్రజలు అవగాహన పెంచుకోవాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామములోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు ఇది. రెండు రకాలుగా ఏర్పడుతుందని మొదటిది దంతాలకు సంబంధించినది అన్నారు దంతాల మీద అడ్డంగా పసుపురంగు గీతలు ఏర్పడతాయని దంతాలు చాక్పీస్ రంగులోకి మారి గుంటలు గుంటలు ఏర్పడి దంతాలు పిప్పిపళ్లు గా తయారవుతాయని తెలిపారు. మనం తినే ఆహారం సరిగా నమల లేకపోతారని తెలిపారు. దీనివలన తలనొప్పి రావడము దంతాలకు రంధ్రాలు పడడం వల్ల సరైన పోషకాహారం తీసుకోలేరు అన్నారు దీనివలన పోషకా హారలేమికి అనేక వ్యాధులకు గురి అవుతారని తెలిపారు. దంత సమస్యల వలన ఇతరులతో కలవకపోవడం. మాట్లాడలేకపోవడం లాంటి సమస్యలు ఏర్పడతాయని తెలిపారు. ఇలాంటివారు టూత్ పేస్టు ను బటాని గింజంత మోతాదులో తీసుకోవాలని. ఉదయం రాత్రి రెండు పూటలా దంతాలు బ్రష్ తో కడుక్కోవాలని తెలిపారు. లక్ష్మీపురం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి జ్యోతి మాట్లాడుతూ నిలువ చేసిన జంక్ ఫుడ్ప తినడం వలన ఆరోగ్య సమస్య వచ్చే అవకాశం ఉందని తెలిపారు. హై ఫ్లోరైడ్ టూత్ పేస్టు నిలువ ఉండే చిరుతిళ్లు . శీతల పానీయాలు. రెడీమేడ్ చిప్స్. ప్యాకేజుడు ఆహార పదార్థాల లో అధికంగా ఫ్లోరైడ్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, శివాలయఆరోగ్యకార్యకర్త, పొజెక్షనిస్ట్ పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ చేస్తున్న సమ్మెకు టీడీపీ మద్దతు

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికై చేపడుతున్న సమ్మెకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ నారపురెడ్డి తెలిపారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి పార్టీ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నారపురెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రక్క రాష్ట్రంలో కన్నా మన రాష్ట్రంలో తక్కువ వేతనాలకే పని చేస్తున్నట్లు తెలిపారు. వారికి ప్రభుత్వం ఇవ్వాల్సిన గ్రాంట్లు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేస్తున్నట్లు తెలిపారు. చిన్న పిల్లలకు అందించాల్సిన పౌష్టిక ఆహార కిట్లపైన నాణ్యత లేదన్నారు. పబ్లిసిటి కోసమే వైఎస్సార్ ప్రభుత్వం జగన్ ఫోటోను ముద్రించి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.


మాట్లాడుతున్న మండల కన్వీనర్ నారపురెడ్డి

నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డిల ఆదేశాల మేరకే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సంపూర్ణ మద్దతు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్లు చంద్రశేఖర్‌రెడ్డి, జడ్ వెంకటరెడ్డి, నాగేశ్వర యాదవ్, మోహన్, పరమేశ్వరరెడ్డి, రామ సుబ్బయ్య, మారెన్న, శేఖర్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసిపి నాయకులు ఒత్తిడితో వాటర్‌మ్యాన్ ఆత్మహత్యయత్నం

- తనను విధుల నుండి తొలగించారని పురుగుల మందు తాగిన వైనం
- బాధితుడిని బళ్లారి ఆసుపత్రికి తరలించిన కుటుంబసభ్యులు



**హోలహర్వి, మేజర్‌న్యూస్ :** హోలహర్వి మండలం అమృతాపురం గ్రామానికి రుద్రప్ప కుమారుడు పరశురాం గత 10 ఏళ్లుగా ఆర్ డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో వాటర్ మెన్ గా పని చేస్తున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన రాజశేఖర్ ఒత్తిడితో మండలానికి చెందిన కొంతమంది వైసీపీ నాయకులు తనను ఉద్యోగం నుండి తొలిగిస్తారని విషయం తెలుసుకున్న పరశురాం తనను ఉద్యోగం నుండి తొలగిస్తారని మనస్థాపంతో ఆత్మహత్యకు ప్రయత్నించారు. అతనిని మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆసుపత్రికి తరలించారు. అయితే పరశురాం తండ్రి రుద్రప్ప కూడా వాటర్ మెన్ 20 ఏళ్ళు పనిచేశారని తనకు వయసు మీద పడడంతో కొడుకు పరశురాం ను పనిలో పెట్టారు. పరశురాం గతం10 ఏళ్లుగా విధులు నిర్వహిస్తు న్నారని అన్నారు. ఉన్నట్టుండి కొంతమంది వైసీపీ నాయకులు హరిజన శేఖర్ ను వాటర్ మెన్ గా ఉంచి పరశురాంను తొలగించుటకు అధికారులతో కుట్రలు పన్నారని తెలుసుకొని తనను ఉద్యోగం నుండి తొలగిస్తారని మనస్తాపంతో పురు గుల మందుతాగి ఆత్మహత్య చేసు కున్నారు. భాదితుడిని హోలహర్వి ఆసుపత్రికి తతలించగా మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా పరశురాం తండ్రి రుద్రప్ప మాట్లాడుతూ తన కుమారుడిని ఉద్యోగం నుండి తొలగిస్తామని మానసికంగా ఒత్తిడి తేవడంతో కుటుంబ పోషణ భారమవుతుందని గ్రహించి ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిసింది. హోలహర్వి పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తామని ఎస్సై నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. భాదితుడికి అండగా ఉంటామన్నారు.

# ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజలు, ఇరుముడులు



**చిప్పగిరి, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన చిప్పగిరిలో అయ్యప్పస్వామి పడిపూజలు,ఇరుముడులు తో పాటు 48 రోజులు అన్నదాన కార్యక్రమాన్ని జడ్పిటిసి విరుపాక్షి స్వామి నిర్వహించారు. గురువారం అయ్యప్ప స్వాములు,శివ స్వాములు,భవాని స్వాములు మూడు లక్షల రూపాయలు వరకు అన్నదాన కార్యక్రమం ఊరేగింపు,ఇరుముడి,మహా పడిపూజ కార్యక్రమాలను సొంత ఖర్చులతో నిర్వహించారు. అయ్యప్పకు అంగరంగ వైభవంగా వేలాది జనం మధ్యలో శ్రీ బోగిలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈ మహా పడిపూజ కార్యక్రమం ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. మాల వేసిన ప్రతి అయ్యప్ప అన్నదాన కార్యక్రమాన్ని 48 రోజుల నిర్వహించినందుకు విరుపాక్షి గురు స్వామిని అయ్యప్ప భక్త మండలి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి కార్యక్రమాన్ని తిలకించారు.

### రాబోయే ఎన్నికలలో

# వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం

### 37వ వార్డులో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం

### టిడిపి పాణ్యం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి



**కల్లూరు, మేజర్‌న్యూస్ :** రాబోయే ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుదామని టిడిపి పాణ్యం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి పిలుపు నిచ్చారు గురువారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ 37 వ వార్డ్ రాముల వారి ఆలయం నందలి కాలనిలలో ఇంటింటి ప్రచారంలో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కాలని లో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు పాణ్యం మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇంచార్జి గౌరు చరిత రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు మహిళ అధ్యక్షురాలు కే పార్వతమ్మ,37 వ వార్డ్ ఇంచార్జి కృష్ణ వెనమ్మ, వార్డ్ క్లస్టర్ ఇంచార్జి జనార్ధన్ ఆచారి,టీడీపీ నాయకులు అడ్వకేట్ నాగ ముని, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్ బిసి సెల్ రాష్ట కార్యదర్శి కాసాని మహేశ్ గౌడ్,అర్బన్ నాయకులు ధనుంజయ,నాగేశ్వరరావు,కోట్ల తిమ్మా రెడ్డి,వార్డ్ నాయకులు సోమన్న, గాంధీ,మదు,ఖాదర్, అన్వర్, శివ తేజ,నారాయణ, గోపన్న తదితరులు పాల్గొన్నారు

# ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా అధికారి


గిరిజన ఆశ్రమ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది గిరిజన ఆశ్రమ పాఠశాలను నంద్యాల జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వెంకట శివ ప్రసాద్ తనిఖీ చేశారు. గురువారం ఆయన ఆశ్రమ పాఠశాలలో ఈ తనిఖీలను చేసి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. తరగతి గదులు, భోజన వసతి, డార్మెంటరీ, పాఠశాల ఆవరణంలో పారిశుద్యం తదితర అంశాలపై పరిశీలన చేసి రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఎం అంబమ్మను పాఠశాల స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం తగు సూచనలు, సలహాలు చేశారు. వీరి వెంట పిఇటి బాష , తదితరులు పాల్గొన్నారు.

### 19 నుంచి 21 వరకు

# వ్యవసాయ కళాశాలలో క్రీడా పోటీలు

### – 27న పాలక మండలి సమావేశం

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాలలో ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కళాశాలల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కెఎస్ఎస్ నాయక్ తెలిపారు. గురువారం ఆయన పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 21వ తేదీ వర కు ఆచార్య ఎన్‌జి రంగ వ్యవసాయ యూనివర్శిటిలోని కళాశాలల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని కళాశాలల విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే ఈ నెల 27వ తేదీన ఆచార్య ఎన్‌జి రంగ యూనివర్శిటి పాలక మండలి సమావేశం జరుగుతుందని ఈ సమావేశానికి వైస్ చాన్సలర్ , బోర్డు మెంబర్లు పాల్గొంటారన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను క్రీడా మైదానాలను సిద్ధం చేశామన్నారు.

# వీధిలైట్లు ఏర్పాటు

**కోసిగి మేజర్ న్యూస్:** మండల పరిధిలోని ఐరనగల్ గ్రామంలో సర్పంచ్ రామాంజినేయులు ఆధ్వర్యంలో వీధిలైట్లను గురువారం ఏర్పాటుచేశారు. గ్రామంలో శనివారం కార్తీక పూజలు జరుగుతుండడంతో వీధిలైట్లను ఏర్పాటుచేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగరెడ్డి, మురళీరెడ్డి ఆదేశాల మేరకు వీధిలైట్లు, తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించినట్లు సర్పంచ్ తెలిపారు. అలాగే గ్రామంలో ఏ సమస్య లేకుండా పండుగ ప్రశాంతంగా జరుపుకునేందుకు కృషిచేస్తామని సర్పంచ్ రామాంజినేయులు తెలిపారు.

### జాతీయస్థాయి బాలోత్సవ్‌లో

# గురురాజ విద్యార్థుల ప్రతిభ

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జాతీయస్థాయిలో గుంటూరులోని నంబూరు నందు బాలోత్సవ్ పోటీలలో నంద్యాల గురురాజ విద్యార్థులకు 41 బహుమతులు గెలుచుకుని పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తెచ్చారని పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణంలో జరిగిన అభినందన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో 60విభాగాలలో 605పాఠశాలల నుంచి 16వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, రాయలసీమలో అత్యధిక బహుమతులు సాధించిన ఒకే ఒక్క పాఠశాల శ్రీగురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాల అని తెలిపారు. అతిథులుగా వివిఐటీ బాలోత్సవ్ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషా సంఘం అధ్యక్షులు విజయ్‌బాబు బహుమతులు అందజేశారని తెలిపారు. డ్రాయింగ్ సబ్ జూనియర్ విభాగంలో ప్రథమ, తృతీయ బహుమతులను దుర్గా, దేవేందర్, జూనియర్ విభాగంలో ధరణిధర్‌రెడ్డి, స్పెషల్ జ్యూరి, సీనియర్ విభాగంలో తృతీయ బహుమతులు తారకరామిరెడ్డి, పద్యపఠం జూనియర్ విభాగంలో తృతీయ బహుమతి గాయత్రి, తెలుగు వక్తృత్వం జూనియర్ విభాగంలో సాయి వర్ధని, ద్వితీయ బహుమతి, సీనియర్ విభాగంలో శివలోహిత్ ప్రథమ బహుమతి, తెలుగులో మాట్లాడుదాం సీనియర్ విభాగంలో పల్లవి ద్వితీయ స్థానం, స్పెషల్ జ్యూరి జోషిత, సబ్‌జూనియర్ విభాగంలో సరయు స్పెషల్‌జ్యూరీలే కాకుండా లఘు చలనచిత్ర విశ్లేషణ, స్టోరీ టెల్లింగ్, ఏకపాత్రాభినయం, కవితా రచన, కథారచన, లేఖారచన, సంస్కృత శ్లోక పఠనం పోటీలలో తమ పాఠశాలల విద్యార్థులు అత్యధిక బహుమతులు సాధించారని తెలిపారు. విద్యార్థుల విజయాలకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.


జాతీయ స్థాయి బాలోత్సవ్‌లో బహుమతులు సాధించిన గురురాజ విద్యార్థులు


జాతీయస్థాయి బాలోత్సవ్‌లో గురురాజ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

సూర్య

శుక్రవారం 15 | డిసెంబర్ 2023

# ఆడుదాం ఆంధ్ర క్రీడలకు వందశాతం నమోదు చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** ఆడుదాం ఆంధ్ర క్రీడలకు క్రీడాకారులను వందశాతం నమోదు చేయాలని జేసీ నారపురెడ్డి మౌర్య సంబంధితాధికారులను ఆదేశించారు. గురు వారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచివివిధ ప్రభుత్వ అంశాలపై జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రకు సంబంధించి శనివారం నాటికి జిల్లాంతటా గ్రౌండ్‌ల ఎంపిక అయ్యేలా చూడా లన్నారు. మండల స్థాయిలోనూ గ్రామస్థాయి లోనూ ఖాళీగా ఉన్న గ్రౌండ్‌లను గుర్తించాల న్నారు. మహిళా క్రీడాకారులను కూడా ప్రోత్స హించే దిశగా వారికి అవగాహన కల్పించి వారిని కూడా క్రీడల్లో భాగస్వామ్యులను చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడా నిర్వహణకు అవసరమైన మైదానాలను త్వరితగతిన గుర్తించాలన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా గ్రామ పంచాయ తీలకు వెళ్లినప్పుడు దండోరా వేయించి అందరూ పాల్గొని యాత్రకు సంబంధించిన ప్రతిజ్ఞ చేసేలా ఎంపీడీవోలు చర్యలు తీసుకో వాలన్నారు. ఆబాది రీసర్వేకు సంబంధించి గూడూరు, ఎమ్మిగనూరు ఓఆర్‌ఐలు వచ్చాయ ని, వాటిని త్వరిగతిన పూఇర్త చేయాలన్నారు. డీఆర్‌ఓ మధు సూధన్‌రావు, జడ్పీ సీఈవో నారసరెడ్డి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం వస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారం..టీజీ భరత్

**– న్యాయవాదులు, అంగన్‌వాడి నిరసనకు మద్ధతు తెలిపిన టీజీ భరత్**

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే అందరి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కర్నూలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని ధర్నా చౌక్‌లో న్యాయవాదులు, అంగన్‌వాడి కార్యకర్తలు చేస్తున్న నిరసనలకు టీజీ భరత్ మద్ధతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే నిర్ణయాలు ప్రభుత్వం తీసుకోకూడదన్నారు. ఏ విషయంలోనైనా నిర్ణయం తీసుకొని అమలు చేసే ముందుకు ఆలోచించాలన్నారు. ప్రభుత్వంలో ఎంతోమంది సలహాదారులు ఉన్నప్పటికీ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ఇలాంటి నిర్ణయాలు ఎందుకు తీసుకుంటున్నారో తెలియడం లేదన్నారు. కోర్టులో వాదించాల్సిన న్యాయవాదులు రోడ్డు మీదకు వచ్చి నిరసన తెలిపే పరిస్థితి వచ్చిందన్నారు. హైకోర్టు కర్నూలుకు రాలేదని, హైకోర్టు ఇష్యూను డైవర్ట్


మాట్లాడుతున్న టీజీ భరత్

చేయడానికే కొత్త సమస్యలు తీసుకవస్తున్నట్లు ఉందన్నారు. అంగన్‌వాడి కార్యకర్తల న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలన్నారు. సరైన ప్రభుత్వాన్ని ఎన్నుకోకపోతే ఇలాంటి పరిస్థితే ఉంటుందన్నారు.

# టీజీ వెంకటేష్ దంపతులకు సన్మానం

**టీజీ వెంకటేష్‌ను కలిసిన నంద్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షురాలు**


టీజీ వెంకటేష్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** నంద్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలుగా ఎన్నికైన గుండా నాగ సుప్రజ శుక్రవారం రాజ్యసభ్య మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ దంపతులను వారి నివాసంలో కలిసి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఎంతో చరిత్ర ఉనన ఆర్యవైశ్య మహాసభకు నూతన కార్యవర్గంలో ఎన్నికైన వారందరూ మహాసభ ప్రతిష్టను మరింత పెంచే విధంగా పనిచేయాలన్నారు. నంద్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలుగా ఎన్నికైన గుండా నాగసుప్రజను అభినందించారు. ఈ సందర్భంగా నాగసుప్రజ మాట్లాడుతూ టీజీ వెంకటేష్ ఆశీస్సులతో తాను ఈ పదవికి ఎన్నికైనట్లు తెలిపారు. అనంతరం టీజీ వెంకటేష్ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు బింగుమళ్ళ శ్యామ్‌సుందర్‌గుప్తా, భవనాసి నాగమహేష్, మలిపెద్ది నాగరాజు, సతీష్‌కుమార్, గుండా మురళీధర్, శ్రీరామసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# సెవెన్ హిల్స్‌లో అత్యంత ఖరీదైన కీళ్ళ మార్పిడి ఆపరేషన్ సక్సెస్

**– సెవెన్‌హిల్స్ ఆసుపత్రి డైరెక్టర్ మారుతి, డాక్టర్ క్రాంతి కిరణ్‌లు**


రోగితో ఆసుపత్రి డాక్టర్ క్రాంతికిరణ్, ఆసుపత్రి డైరెక్టర్ మారుతికుమార్

**నంద్యాల, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని సెవెన్ హిల్స్ మల్టీస్పెషల్ ఆసుపత్రిలో విజయవంతంగా మెకాలు కీళ్ళ మార్పిడి రివిజన్ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని ఆపరేషన్ చేసిన ఆర్థోపెడిక్ వైద్యులు క్రాంతి కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం గోపిపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి సుమారుగా 8 సంవత్సరాల క్రితం తిరుపతి పట్టణంలో తన రెండు మోకాళ్ళకు కీళ్ళ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్నాడు. కాని అనుకొని విధంగా టూ వీలర్ నుంచి కింద పడడంతో తన కుడి కాలికి గాయం కారణంగా విపరీతమైన ఇన్‌ఫెక్షన్ వచ్చి ఇన్‌ప్లాంట్ తొలగించడం జరిగింది. దీనితో కేవలం రెండు సంవత్సరాలుగా మంచానికే పరిమితమయ్యారు. అప్పటి నుంచి రివిజన్ ఆపరేషన్ కొరకు హైదరాబాద్, తిరుపతి, చెన్నై వంటి పట్టణాలలో కన్సల్టేషన్ కొరకు సంప్రదించగా రివిజన్ మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స సుమారుగా రూ. 7లక్షల నుంచి పది లక్షల వరకు ఖర్చువు తుందని తెలిపారు. దీంతో ఆర్థికంగా అంత నగదు చెల్లించలేక ఉన్నప్పుడు అదే పట్టణానికి చెందిన వైయస్సార్‌సీపీ పుట్టపర్తి సమన్వయకర్త కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి కృష్ణారెడ్డిని పరామర్శించి నంద్యాల జిల్లాలో సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో కేవలం ఇంప్లాంట్ ఖర్చు పెట్టుకోగలిగితే ఆపరేషన్ మందులు ఉచితంగా చేస్తారని సోమశేఖర్‌రెడ్డి


ఆపరేషన్ అనంతరం కృష్ణారెడ్డి

చెప్పడం తో కృష్ణారెడ్డి సెవెన్ హిల్స్ మల్టీ స్పెషల్ ఆసుపపత్రిలో సంప్రదించగా శ్రీకాత్యాయిని సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వీరికి కేవలం రూ. 3లక్షల ఇం ప్లాంట్ ఖర్చుయిం దన్నారు. ఈసందర్భంగా ఆసుపత్రి డైరెక్టర్ రెంటాల మారుతికుమార్ మాట్లాడుతూ ఇదివరకే శ్రీకాత్యాయిని సేవా ట్రస్ట్ ద్వారా సుమారుగా 15కు పైగా మోకాళ్ళ కింద మార్పిడి ఆపరేషన్లు ఉచి తంగా చేయడం జరిగిందని తెలిపారు. మోకా ళ్ళ అరుగుదలతో బాధ పడుతున్న వారు ఎటువంటి అపోహలు లేకుండా శ్రీకాత్యాయిని సేవా ట్రస్ట్ ద్వారా సంప్రదించి మోకాళ్ళ కీళ్ళ మార్పిడి ఆపరేషన్లు ఉచితంగా చేయడం జరుగుతుందని తెలిపారు. కేవలం ఇంప్లాంట్ ఖర్చు మాత్రమే ఖర్చు అవుతుందని నంద్యాల, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని విని యోగించుకోవాలని తెలిపారు. ఈమోకాళ్ళ కీళ్ళ మార్పిడి ఆప రేషన్‌కు సహకరించిన జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, అనస్తీషియా వైద్యులు మధుసూధన్‌రెడ్డి, వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు

# హృదయ్ పథకం కింద కర్నూలు, రాజమండ్రి నగరాలను చేర్చండి

**– కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవకుమార్**


కర్నూలు ఎంపీ సంజీవకుమార్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** నేషనల్ హెరిటేజ్ సిటీ డెవలప్‌మెంట్ అండ్ అగ్మెంటేషన్ యోజన(హృదయ్) పథకం కింద కర్నూలు, రాజమండ్రి నగరాలను చేర్చేందుకు అవకాశం ఉందని తగిన చర్యలు తీసుకోవాలని కర్నూలు ఎంపీ డాక్టర్‌సంజీవకుమార్ కేంద్ర గృహ నిర్మాణ మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కోరారు. గురువారం పార్లమెంటులో ప్రశ్నోత్తరాల సమయంలో హృదయ్ పథకంలో కర్నూలు జిల్లాను చేర్చే అంశాన్ని లేవనెత్తారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ హృదయ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2015లో ప్రవేశపెట్టడం జరిగిందని, అయితే పథకంలో కర్నూలు, రాజమండ్రి నగరాలు ఉన్నట్లు అయితే బడ్జెట్ ఏ విధంగా కేటాయిస్తారని, ఈ నగరాలు లేకపోతే చేర్చే అవకాశాలు ఉన్నాయా ప్రశ్నించారు. దీనికి కేంద్ర మంత్రి హరిదీప్‌సింగ్‌పూరి సమాధానం ఇస్తూ ఈ పథకం 2019 మార్చిలో ముగిసిందని, కొత్తగా ఇతర నగరాలను చేర్చేందుకు అవకాశం లేదని సమాధానమిచ్చారు.

# కన్నుల పండుగగా కోసిగయ్య కార్తీక దీపోత్సవం

**– స్వామివారిని దర్శించుకున్న భక్తులు**


దీపోత్సవం చేపడుతున్న మహిళలు

**కోసిగి మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన కోసిగిలో ఖాసీంగడ్డ కాలనీలో వెలసిన కోసిగయ్య దేవాలయంలో కార్తీక దీపోత్సవంను గురువారం కన్నుల పండుగగా జరిగింది. కార్తీకమాసం పూర్తికావడంతో కోసిగిలో గురువారం కోసిగయ్యస్వామికి ప్రత్యేక పూజలు కార్తీక దీపోత్సవంను చేపట్టారు. కార్తీక మాసం సందర్భంగా నెలరోజులపాటు మాంసం, మద్యం వంటివాటిని తినకుండా పవిత్రంగా కోసిగయ్యస్వామిని పూజించడం జరుగుతుంది. నెలరోజుల తరువాత దీక్షను ఉపేక్షించి పూజలు నిర్వహిస్తారు. అలాగే స్వామివారికి పుష్పాలంకరణ, కుంభాభిషేకం, మహామంగళారతి వంటి పూజలను అర్చకులు శ్రీరాములు, గోపాలస్వామి, ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలు మురళీకృష్ణంరాజ్‌దొర, శ్రీనివాస్‌రాజ్‌దొర సమక్షంలో పూజలు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా యువతీ యువకుల కోలాటాలతో కళకళలాడుతుంది.

# మున్సిపాలిటీ స్థలాన్ని 18వ వార్డు కౌన్సిలర్ అక్రమణ

**– ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేస్తున్న కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలి**

**– చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న మున్సిపల్ కమీషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు**

**– మాజీ టీడీపీ ఇంచార్జీ కృష్ణమ్మ**


వార్డు సమస్యలను తెలుసుకుంటున్న ఆది గుడిసె కృష్ణమ్మ

**ఆదోని, మేజర్ న్యూస్ :** మున్సిపాలిటీ స్థలాన్ని అక్రమించిన 18వ వార్డు కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలని మాజీ టీడీపీ ఇంచార్జీ ఆది గుడిసె కృష్ణమ్మ పేర్కొన్నారు. గురువారం బండిమెట్ట, ఎంఎం కాలనీలలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైఎస్సార్ పార్టీకి చెందిన కౌన్సిలర్ ప్రజల కోసం నిర్మించిన మరుగుదొడ్లను కూల్చేసి సొంత ఇంటిని నిర్మించుకుంటున్నాడని, మున్సిపాలిటీ నిధులను మున్సిపాలిటీ నష్టం చేస్తున్నా మున్సిపల్ కమీషనర్, టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం లేదన్నారు. ఈ స్థలానికి పట్టా ఇవ్వాలని లెటర్ కూడ మున్సిపల్ కౌన్సిలింగ్ తీర్మానం అయిన తరువాత జిల్లా కలెక్టర్, రీజినల్ డైరెక్టర్ కార్యాలయం అనంతపురం వారు స్థానిక మున్సిపల్ అధికారులకు నివేదిక ఇవ్వాల్సి ఉందన్నారు. కలెక్టర్ ఆదేశాలు ప్రస్తుతం ఆ స్థలాన్ని వాల్యుయేషన్ వేస్తే ఆ స్థలాన్ని లీజుకు ఇచ్చి ఎన్ని సంవత్సరాలు అగ్రిమెంట్ అయిన తరువాతనే మున్సిపల్ కమీషనర్, తహశీల్దార్‌లకు పట్టా ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పెడ చెవిన పెట్టారన్నారు. ఈ స్థలానికి సంబంధించిన ఆధారాలు జిల్లా కలెక్టర్, రీజినల్ డైరెక్టర్ అనంతపురం వారికి అందజేస్తామన్నారు. మున్సిపాలిటీకి ఉపయోగపడే కార్యాలయాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, వడ్డేమాన్ గోపాల్, మాజీ ఎంపిపి మురళీ, సయ్యద్ వసీం ఖాద్రీ, గోపాల్, పెద్దతుంబళం మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ కొండాపురం శ్రీనివాసులు, నరసప్ప, భరత్, వీరేష్, బోయ వీరన్న, రమేష్, లింగయ్య, రాఘవేంద్రరెడ్డి, బాబురావు, లక్ష్మీరెడ్డి, నాగేంద్ర, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వంగాల భరత్


వంగాల భరత్‌కుమార్‌రెడ్డి

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :**

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నంద్యాల జిల్లాకు చెందిన వంగాల భరత్‌కుమార్‌రెడ్డిని నియమించింది. ప్రస్తుతం వంగాల భరత్‌కుమార్‌రెడ్డి నంద్యాల జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మెన్‌గా ఉన్నారు. ఈయనకు మంత్రాలయం నియోజకవర్గ పరిశీలకుడిగా వైఎస్సార్‌సీపీ అధిష్టానం నియమించింది. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం తనవంతు కృషి చేస్తానన్నారు. పార్టీ తనపై ఉంచుకున్న నమ్మకాన్ని నిలబెడతానన్నారు.